
సాక్షి ఒడిశా

మంగళవారం। 31। అక్టోబర్। 2023

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,84,370లు, బంగారం 5గ్రాము 150 మిల్లీగ్రాములు, వెండి 3 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జగన్నాథుని సన్నిధిలో గవర్నర్

రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన రఘుబర్ దాస్ మంగళవారం పూరీ జగన్నాథుడిని దర్శించుకున్నారు.

- IIలో



అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి

రాష్ట్రంలో అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు.

- IIలో

న్యూస్‌రీల్

ఐదుగురు దుండగులు అరెస్టు



అరెస్టైన వ్యక్తులు, మారణాయుధాలు చూపిస్తున్న పోలీసులు

బరంపురం: స్థానిక టంగనాపల్లి పెట్రోల్ బంకుపై అర్ధరాత్రి దాడిచేసి దోపిడీకి ప్రయత్నించిన ముఠాని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారి దగ్గర నుంచి 2 ద్విచక్ర వాహనాలు, రెండు కత్తులు, ఇనుప రాడ్డు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి రేవతి సబర్ తెలిపిన వివరాల మేరకు.. పెట్రోల్ బంకుపై దుండగులు దాడిచేసి, దోపిడీకి సిద్ధమవుతున్న సమయంలో పెట్రోలింగ్ జరుపుతున్న పోలీసుల కంటపడింది. దీంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దండగులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో తపస్ సెఠి, పూర్ణ చంద్ర, సాంబర్ కొటా, సలీం ఖాన్ మరియు టుకునా బెహరాలు ఉన్నట్లు వెల్లడించారు.

కశ్మీర్‌కు గిరిజన యువత



జమ్మూ కాశ్మీర్ వెళ్లనున్న యువతతో బీఎస్‌ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని గిరిజన యువతీ, యువకులకు జిల్లా నుంచి బయట ప్రపంచంపై అవగాహన కల్పించడం కోసం బీఎస్‌ఎఫ్ అధికారులు సొంత ఖర్చులతో పలు ప్రదేశాలు సందర్శించేలా చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఈసారి 20 మందిని నవంబర్ 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కశ్మీర్ పంపించనున్నారు. ఈ మేరకు స్థానిక బీఎస్‌ఎఫ్ క్యాంప్ వద్ద సోమవారం చర్చించారు. ఈ మేరకు 14 బృందాలు యువత ఆధార్ కార్డులు, సంబంధింత వివరాలను సేకరించారు. వీరికి జమ్మూ కాశ్మీర్‌లోని పర్యాటక ప్రదేశాలు చూపించడంతో పాటు రాజకీయ నేతలు, చిత్ర పరిశ్రమ గురించి తెలియజేయనున్నట్లు బీఎస్‌ఎఫ్ 2వ బెటాలియన్ కామాండర్ వరునేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. వీరితో పాటు ఆరుగురు జవాన్లు వెళ్తారని వెల్లడించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

చైర్మన్ శంకర్ మృతి



ఎన్ని శంకర్(ఫైల్)

పర్లాకిమిడి: స్థానిక అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ మరియు బీజేడీ సీనియర్ నాయకుడు ఎన్ని శంకర్ (52) సోమవారం వేకువజామున తన స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. గత కొన్ని నెలలుగా ఆయన కాలేయంకు సంబంధించిన కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయన మృతికి అర్బన్ బ్యాంకు డైరెక్టర్లు, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ కుమార్, బసంత్ దాస్, హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి, రూపేష్ పాణిగ్రాహి, బప్పి పట్నాయిక్, పర్లాకిమిడి వ్యాపార సంఘాలు తదితరులు సంతాపం ప్రకటించారు.

ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ప్రపంచ మిత వ్యయం లేదా సేవింగ్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా చిన్న మొత్తాల పొదుపు సంస్థ ప్రచార రథాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సోమవారం ప్రారంభించారు. జిల్లా చిన్న మొత్తాల పొదుపు సంస్థ ద్వారా ఇటీవల పోస్టల్ శాఖ మహిళల కోసం మహిళా సేవింగ్స్ సర్టిఫికెట్లు రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకూ విడుదల చేసిందని తెలియజేశారు. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్లపై 8.5 శాతం వడ్డీ వార్షికంగా మహిళలకు లభిస్తుందని చిన్న మొత్తాల పొదుపు శాఖ అధికారి ప్రదీప్ కుమార్ పాఢి అన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో ప్రదీప్త గురుమయి, చిన్న మొత్తాల పొదుపు సంస్థ అజిత్ కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

అమ్మో రైలు..!



- ప్రాణాలను బలిగొంటున్న ప్రయాణం
- భద్రతపై రైల్వే శాఖ నిర్లక్ష్యం
- నిత్యం సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు

భువనేశ్వర్: రైలు ప్రయాణం అంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. రైలు ఎక్కితే ప్రాణాలతో గమ్యం చేరేంతవరకు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితులు నిత్యకృత్యంగా తారసపడుతున్నాయి. రైల్వేశాఖ ఈ దిశలో చేపడుతున్న నిర్మాణాత్మక చర్యలు శూన్యంగా గోచరిస్తున్నాయి. ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బహనాగా రైల్వేస్టేషన్ దగ్గర సంభవించిన ఘోరమైన రైలు దుర్ఘటన ఛాయలు తొలగక ముందే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగం జిల్లాలో ఇటువంటి మరో ప్రమాదం చోటు చేసుకోవడం విచారకరం. ఆధునిక పరిజ్ఞానంతో పట్టాలపై భద్రతాపూర్వకంగా మెరుపు వేగంతో వందే భారత్ వంటి ప్రయాణికుల రైళ్లని దిగ్విజయంగా పరుగులు తీయిస్తున్నామని చేస్తున్న ప్రచారం, గాలిలో మేడలుగా కుప్పకూలుతున్న పరిస్థితులకు వాస్తవ సంఘటనలు అద్దం పడుతున్నాయి.

భద్రత కార్యాచరణ లోపం

రైలులో ప్రయాణికులకు భద్రత కల్పించడంపై రైల్వే శాఖ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు బలపడుతున్నాయి. బాలాసోర్ జిల్లా బహనాగా బజారు ట్రిపుల్ రైలు దుర్ఘటన వెంబడి విజయనగరం జిల్లాలో ఆదివారం సాయంత్రం విపత్తు పునరావృతం కావడం దీనికి నిదర్శనం. బహనాగా రైలు దుర్ఘటన సమయంలో రైల్వే మంత్రి ప్రయాణికుల భద్రత కోసం ప్రామాణిక కార్యాచరణ నియమావళి (ఎస్‌ఓపీ) ప్రవేశపెడతామన్న వాగ్దానం గాలిలో కలిసిపోయిందని, జయపురం నియోజకవర్గం ఎమ్మెల్యే, కాంగ్రెసు సీనియర్ నాయకుడు తారా ప్రసాద్ బహిణీపతి విరుచుకుపడ్డారు.

సిగ్నలింగ్ వ్యవస్థ లోప పూరితం

తాజా దుర్ఘటన ప్రాంతంలో ఇటీవల 3 నెలల క్రితం ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ వర్కింగ్ వ్యవస్థ పాక్షికంగా మొరాయించడంతో ప్రాణాంతక సంఘటన అనివార్యమైనట్లు ప్రాథమిక సమాచారం. సిగ్నలింగ్, సాంకేతిక వ్యవస్థ పటిష్టత లోపం కప్పిపుచ్చే దిశలో దుర్ఘటనలో దివంగతులైన లోకో పైలట్ల తప్పిదంతో ముడి పెట్టేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంటకాపల్లి, అలమండ స్టేషన్ల మధ్య ఉదయం నుంచి రెండు ఆటోమేటిక్ సిగ్నల్స్ మొరాయించాయి. ఈ పరిస్థితిపై లోకో పైలట్లు దృష్టి సారించాల్సిన పరిస్థితులను బలపరిచి, విచారణ తప్పుదారి పట్టించే యోచనతో క్షేత్రస్థాయిలో రంగం సిద్ధమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ లోపం లేకుంటే ఈ ప్రమాదానికి అవకాశం ఉన్నది, లేనిది స్పష్టం కావాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను విధి నిర్వహణలో ఉన్న లోకో పైలట్లకు ముందస్తుగా సమాచారం జారీ చేసినా, నిర్లక్ష్యంగా దూసుకుపోవడంతో దుర్ఘటన అనివార్యమైనట్లు ప్రాథమిక వాంగ్మూలంగా ప్రచారం ఊపందుకుంటోంది.

నిగ్గు తేలాల్సి ఉంది

పట్టాలపై పరుగులు తీస్తున్న రైళ్లని సురక్షితంగా గమ్యం చేర్చడంలో కీలక పాత్ర పోషించే సిగ్నలింగ్ వ్యవస్థ లోప రహితంగా పని చేయడంపై జవాబుదారీతనం స్పష్టం కావాల్సి ఉంది. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన లోకో సిబ్బంది, అనుబంధ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సమాచారం, సంకేతాలను ఉల్లంఘించినట్లు ధ్రువీకరణ స్పష్టమయ్యే దిశలో ఉన్నత స్థాయి విచారణ త్వరలో జరుగుతుంది. ప్రాణనష్టం సంభవించినందున రైల్వే భద్రతా కమిషనర్ (సీఆర్‌ఎస్) విచారణ చేపడతారు. లోకో పైలట్ల తప్పిదాన్ని ధ్రువీకరించడంలో డేటా లాగరు దోహదపడుతుంది. ఈ వ్యవస్థ సిగ్నల్ విభాగం ఆధీనంలో పని చేస్తుంది. దుర్ఘటనపాలైన ఇంజిన్‌లో కొంత మేరకు సాంకేతిక ఇతరేతర ఆధారాల పర్యవేక్షణ అవసరమే. ఈ కోణాల్లో దివంగత లోకో పైలట్ల నెత్తిన తప్పిదం రుద్ది విచారణకే పరిమితమైతే లోప భూయిష్టం అవుతున్న సిగ్నలింగ్ వ్యవస్థ సంస్కరణకు ఏమాత్రం అవకాశం ఉండదు. కారుణ్యంతో విషాద ఘటనలకు తెరదించడంతో కథ ముగిసిపోతుంది. ప్రయాణికుడికి హామీ పూర్వక, పూచీదారి భద్రత గగనంగా మారుతుంది.

దేవుడి దయతో బయటపడ్డాం



సురక్షితంగా ఇంటికి చేరుకున్న పాత్రో కుటుంబ సభ్యులు

- తలచుకుంటే నిద్రపట్టడం లేదు
- రైలు ప్రమాదం నుంచి బయటపడిన కుటుంబం

రాయగడ:

విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో దేవుడి దయతో బయటపడ్డామని, అసలు బతుకుతామని అనుకోలేదని ప్రమాదం నుంచి బయటపడిన ఒక కుటుంబం పేర్కొంది. ఇప్పటికీ ప్రమాద సంఘటన తలుచుకుంటే నిద్ర పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పయికోవీధిలో నివాసముంటున్న ఒడిశా పోలీసు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దిలీప్ కుమార్ పాత్రో (41), అతని భార్య సుజాత స్వాయి (40), ఎనిమిదేళ్ల కూతురు సుదీక్ష పాత్రో, మేనకోడలు అనన్య గంతాయిత్ (7), అతని తల్లి సుష్మా కుమారి పాత్రోలు సరదాగా గడపడానికి శనివారం విశాఖపట్నం వెళ్లారు. అనంతరం ఆదివారం విశాఖపట్నం–రాయగడ ప్యాసింజర్ ట్రైన్‌కు తిరుగు ప్రయాణం కోసం రిజర్వేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో విశాఖ–రాయగడ ప్యాసింజర్ ట్రైన్‌లో బోగీ నంబర్ డీ–1లో తమకు కేటాయించిన బెర్తుల్లో కూర్చున్నారు.

అంతలోనే ప్రమాదం

ఎంతో సరదాగా రెండు రోజులు గడిపిన విషయాలను కుటుంబమంతా చర్చించుకుంటున్న సమయంలో, ట్రైన్ కంటకాపల్లి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా తాము కూర్చున్న బోగి ఎగిరిపడింది. సుమారు రెండు అడుగుల ఎత్తుకు ఎగరడంతో తామంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డామని దిలీప్ అన్నారు. తమ పిల్లలు పైబెర్తులో ఉండడంతో పైనుంచి కిందికి పడిపోయారు. లగేజీలు చెల్లాచెదురయ్యాయి. ఇంతలో తాము ప్రయాణిస్తున్న ప్యాసింజర్ రైలు ప్రమాదానికి గురయ్యిందని తెలుసుకున్నామని పాత్రో తమ చేదు అనుభవాలను పంచుకున్నారు.

చుట్టూ చీకటిమయం

ప్రమాదం జరిగిన ప్రాంతమంతా చీకటిమయంగా ఉందని ఆయన తెలియజేశారు. బోగి మెయిన్ డోర్ కొద్దిగానే తెరిచి ఉంది. దీంతో అతికష్టం మీద అక్కడకు వెళ్లి చూసేసరికి ప్రయాణికులు పరుగులు తీస్తుండడం కనిపించింది. ఆర్తనాదాలు వినిపించాయి. అరగంట వ్యవధిలో సంఘటన స్థలానికి అంబులెన్స్‌ల సైరన్‌లు వినిపించాయి. దీంతో భయాందోళనకు గురైన తామంతా కష్టం మీద బోగి నుంచి కిందికు దిగి అరగంట సమయం రైలు ట్రాక్‌పై నడుచుకుంటూ అతికష్టం మీద కంటకాపల్లి రోడ్డుకు చేరుకున్నామన్నారు. రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బస్సు రావడంతో అందరం ఎక్కి విజయనగరం చేరుకున్నట్లు వెల్లడించారు. అనంతరం ఒక ట్యాక్సీ బుక్ చేసుకొని సుమారు రాత్రి మూడు గంటలకు రాయగడ చేరుకున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ తమ పిల్లలు ఆ భయం నుంచి బయటపడలేదని సుజాత స్వాయి అన్నారు. రైలు ప్రయాణం సురక్షితంగా భావిస్తున్నప్పటికీ, కొద్ది నెలలుగా తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను చూస్తే అసలు ప్రయాణించేందుకు ఇష్టపడడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన ఆరుగురు పేకాటరాయుళ్లు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు

బరంపురం: గంజాం జిల్లాలో కొద్దిరోజులుగా రహస్యంగా నడుస్తున్న రెండు వేర్వేరు జూదం అడ్డాలపై పోలీసులు దాడులు నిర్వహించి, 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్డీపీవో పాఠి తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని దిగపండి పోలీసుస్టేషన్ పరిధి మంగరాజ్‌పూర్ గ్రామంలోని ఒక ఇంటిలో రహస్యంగా జూదం అడ్డా నడుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు జూదం అడ్డాపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి రూ.19,240 నగదు, 5 సెల్‌ఫోన్లు, 2 పేకకట్టలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సదర్ పోలీసుస్టేషన్ పరిధి అంకుసుపురం గ్రామంలోని మామిడి తోటలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై జరడా పోలీసులు దాడిచేసి 5 మంది జూదగాళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.27,290 నగదు, 3 సెల్‌ఫోన్లు, 1 పేకకట్ట స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన కరాటే శిక్షణ శిబిరం



ప్రతిభావంతులను సత్కరిస్తున్న దృశ్యం

బరంపురం: నగరంలోని లంజిపల్లిలో తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న కరాటే శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. శిబిరంలో వివిధ పాఠశాలలకి చెందిన అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభావంతులకు పతకాలతో సత్కరించినట్లు శిక్షకుడు ఎస్.బాలకృష్ణ రెడ్డి తెలియజేశారు. గంజాం క్రీడాకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు విజేతలకు అభినందనలు తెలిపారు.

స్వచ్ఛమైనది తెలుగు భాష

- ఆచార్య సిమ్మన్న



సిమ్మన్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

రాయగడ: అన్ని భాషలకంటే స్వచ్ఛమైనది తెలుగు భాష అని విశాఖపట్నంకు చెందిన ఆహు గ్రంథకర్త, సాహితీవేత్త ఆచార్య డాక్టర్ వెలమల సిమ్మన్న అన్నారు. స్థానిక రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహా కవులు రచించిన భారతం, భాగవతం, రామాయణం వంటి పురాణాలు, గ్రంథాలు నేటికీ ప్రజాధరణ పొందడానికి కారణం తెలుగు భాష, సాహిత్యానికి ఉన్న గొప్పతనమేనని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సాహితీ రంగానికి అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాహిత్యానికి తగు ప్రాధాన్యత కరువవుతుండడం విచారించదగ్గ విషయమన్నారు. సాహిత్యాన్ని భావితరాలకు అందేలా నేటి కవులు, రచయితలు తమ రచనలు కొనసాగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సాహిత్యానికి ఎల్లలు లేవు

సాహిత్యానికి ఎల్లలు లేవని విశాఖ నుంచి వచ్చిన కవి, నాటక, సినీ రచయిత, విశ్రాంత సైంటిఫిక్ అధికారి చొక్కర తాతారావు అన్నారు. ప్రతీ కవి తన ఆలోచనలను సాహిత్యం రూపంలో తెలియజేయవచ్చన్నారు. ఆధునిక కవిత్వం పోకడలపై ప్రసంగించారు. స్పందన కార్యదర్శి డాక్టర్ పతివాడ తులసీదాస్ స్పందన సంస్థ వార్షిక నివేదికను చదివి వినిపించారు. సాంస్కృతిక కార్యదర్శి కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్ సభా నిర్వహణ చేశారు. అనంతరం స్పందన నృత్య పాఠశాల విద్యార్థినుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. స్పందన సంస్థ సభ్యులు టీవీఎస్‌ఆర్ అప్పారావు, పిల్లల శంకర రావు, కేకేఎం పట్నాయక్, మార్టిన్ లూథర్, బాలకృష్ణ పట్నాయక్ తదితరులు ధర్మం.. శరణం గచ్ఛామీ అనే నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలగా నిలిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు.



నాటక ప్రదర్శనలో ఒక సన్నివేశం



చిన్నారి నృత్య ప్రదర్శన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మాక్‌డ్రిల్



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిదా తదితరులు

గంజాం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రకృతి వైపరీత్యాలపై అగ్నిమాపక అధికారులు సోమవారం మాక్ డ్రిల్ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దివ్యజ్యోతి ఫరిడా హాజరై ప్రారంభ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతరులను ఎలా రక్షించాలో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్షంగా చూపించారు. ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

– బరంపురం



ప్రారంభ జ్యోతిని వెలిగిస్తున్న దృశ్యం



క్షతగాత్రులను తరలించే విధానంపై అవగాహన



లీక్ అవుతున్న గ్యాస్‌ను ఆర్పే విధానం చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పీవీకె మణికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, నవత ట్రాన్స్‌పోర్ట్, ముత్తూట్ ఫైన్స్, హీరో కార్పొరేషన్, పేటీఎం తదితర సంస్థల వారు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కావున పదవ తరగతి, ఐటీఐ, డిప్లమో, ఇంటర్మీడియట్, డిగ్రీ , ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు 50మంది ఎంపిక


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో హెటిరో ఫార్మా కంపెనీ సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 50మంది యువత ఉద్యోగాలు పొందినట్లు కళాశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. జాబ్‌మేళాకు 150మంది నిరుద్యోగులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రవిశాస్త్రి, కోఆర్డినేటర్ ఎన్.సురేష్, సిబ్బంది తదితరులున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన యువతను సిబ్బంది అభినందించారు.

3,400 లీటర్ల సారా ధ్వంసం


సారాను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

పార్వతీపురంటౌన్: గడిచిన రెండు నెలల నుంచి 62 కేసుల్లో సీజ్ చేసిన 3,400 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పరిధిలోని నవిరి కాలనీ సమీపంలో గల పాత తోటపల్లి రహదారి పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం తయారు చేసిన, విక్రయించినా తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విషాహారంతో ఐదుగురికి అస్వస్థత

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో విషారం తినడం వల్ల ఓ కుటుంబం తీవ్ర అస్వస్థతకు గురైంది. మురగడాపు లక్ష్మణ్‌దొర, గౌరమ్మ, చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్, రూపలు ఆదివారం ఇంటిలో టిఫిన్ చేస్తుండగా చట్నీలో బల్లి పడింది. ఈ విషయం గమనించకుండా వారంతా టిఫిన్ తినేశారు. దీంతో కుటుంబసభ్యులంతా ఒక్కసారిగా వాంతులు చేసుకోవడం ప్రారంభించార. ఈ విషయం గమనించిన స్థానికులు బాధిత కుటుంబసభ్యులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల్లో నలుగురి ఆరోగ్య పరిస్థితి కుదుటపడడంతో ఇంటికి పంపించేశారు. చంద్రశేఖర్ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో బంధువులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భోగాపురం: మండలంలోని తోటపల్లి మద్యం షాపు వద్ద ఈనెల 17న ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో విశాఖపట్నంలోని జాలారిపేటకు మరుపల్లి చినరాము(20)పై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో సిరిపురం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు హెచ్‌ఎం వి.వెంకటరావు సోమవారం తెలిపారు. బి.సోనియా 100మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానం, డి.జ్యోత్స్న 600మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం , సీహెచ్ యశ్వంత్, ఆర్.స్వాతిలు లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, బి.వెంకటలక్ష్మి జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం, ఎ.డిల్లీశ్వరరావు హైజంప్‌లో ద్వితీయ స్థానం, మణిచంద్ 2కె రన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం చెప్పారు. ఈ ప్రతిభను చూపిన విద్యార్థులందరితో పాటు, పీడీలను సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి


భువనేశ్వర్: ప్రభుత్వ ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్


భువనేశ్వర్: ప్రతిజ్ఞ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు

- సీఎం నవీన్ పట్నాయక్
- ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ

భువనేశ్వర్: రాష్ట్రంలో అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారం ప్రారంభోత్సవం పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో 'సమగ్రతా ప్రతిజ్ఞ' చేయించారు. ఈ సందర్భంగా స్థానిక లోక్‌సేవ భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. అవినీతి వద్దు - జాతికి అంకితం ముద్దు (సే నో టు కరప్షన్ - కమిట్ టు నేషన్) నినాదంతో ఈ ఏడాది అవినీతిపై అవగాహన వారం ఈనెల 30 నుంచి నవంబర్ 5 వరకు నిర్వహిస్తారన్నారు. సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సమగ్రత ప్రతిజ్ఞను ముఖ్యమంత్రి ఒడిశా స్టేట్ వైడ్ నెట్‌వర్క్ (ఓస్వాన్) ద్వారా అన్ని జిల్లా మరియు మండల ప్రధాన కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారంతో సాధారణ ప్రజలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంచాయతీలు, ఆశా మరియు అంగన్‌వాడీ కార్యకర్తలతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. దీంతో ప్రతి స్థాయిలో అవినీతి రహిత సమాజంపై అవగాహనను మరింత బలోపేతం చేస్తుందన్నారు.

ఒడిశా విజిలెన్స్ భేష్

నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో వెల్లడించిన తాజా గణాంకాలు ప్రకారం దేశంలోనే అగ్రగామిగా పనిచేస్తున్న అవినీతి నిరోధక సంస్థల్లో ఒడిశా విజిలెన్స్ ఒకటిగా నిలిచిందని ముఖ్యమంత్రి అభినందించారు. ఏడాది కాలంలో ఒడిశా విజిలెన్స్ సీనియర్ ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బినామీ లావాదేవీలు, మనీలాండరింగ్, క్రిప్టో-కరెన్సీల వంటి డిజిటల్ లావాదేవీల ద్వారా అవినీతి, కొత్త ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులను సమర్థవంతంగా గుర్తించడంలో సహాయపడడానికి డొమైన్ నైపుణ్యం కలిగిన మరింత మంది నిపుణులను నియమించడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం మరియు బహుళ క్రమశిక్షణా ప్రాధాన్యత విస్తరణకు విజిలెన్స్ విభాగం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలనే తమ సంకల్పాన్ని పునరుద్ధరించుకోవాలి. అవినీతి రహిత మరియు కొత్త సాధికారత కలిగిన ఒడిశాకు నాంది పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యాలయం ప్రారంభం

బాలాసోర్ మరియు రౌర్కెలాలో కంప్యూటర్ ఆధారిత ఇన్వెస్టిగేషన్ అండ్ ప్రాసిక్యూషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మరియు విజిలెన్స్ డివిజన్ కార్యాలయ నూతన భవనాలను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మాట్లాడుతూ ప్రజా జీవితంలో నిజాయితీ మరియు చిత్తశుద్ధిని అమలు చేయడం ఇప్పటికే మన రాష్ట్ర విధానానికి ప్రధాన స్తంభాల్లో ఒకటని అన్నారు. అవినీతిపై పోరాటంలో ఒడిశా ముందంజలో ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒడిశా విజిలెన్స్ 38 గ్రూప్-ఏ అధికారులు, 37 గ్రూప్-బి అధికారులతో సహా 364 మందిపై 201 కేసులు నమోదు చేసింది. 42 గ్రూప్-ఏ మరియు 31 గ్రూప్-బి అధికారులతో సహా 486 మందిపై 198 కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేయబడ్డాయి. 115 మంది నిందితులపై 87 కేసులు ముగిశాయి. 27 మంది ప్రభుత్వోద్యోగులు సర్వీస్ నుంచి తొలగించబడ్డారు. 14 మంది రిటైర్డ్ పబ్లిక్ సర్వెంట్లకు విజిలెన్స్ కేసుల్లో దోషులుగా తేలిన తర్వాత పెన్షన్ నిలిపివేయబడిందని తెలియజేశారు. అనంతరం ఉత్తమ విజిలెన్స్ విభాగం, ఉత్తమ విజిలెన్స్ యూనిట్, ఉత్తమ దర్యాప్తు అధికారి (పురుషులు మరియు మహిళలు), ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సత్కరించారు.

రాయగడ: అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సూర్యమణి భోయ్, అసిస్టెంట్ జిల్లా మేజిస్ట్రేట్ రంజన్ కుహరో, విజిలెన్స్ డీఎస్పీ తర్దుతా బెహర తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ మినిస్టీరియల్ సంఘం ఉద్యోగులతో అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్‌లు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ఒక చైతన్య ర్యాలీని అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీసు ఉద్యోగులు పాల్గొన్నారు.


భువనేశ్వర్: ఉత్తమ సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం


రాయగడ: ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్


పర్లాకిమిడి: చైతన్య ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

జగన్నాథుని సన్నిధిలో గవర్నర్


జగన్నాథుని ఆశీస్సులు అందుకుంటున్న రఘుబర్ దాస్


గవర్నర్ రఘుబర్ దాస్‌కు ఆత్మీయంగా స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్


పుష్పగుచ్ఛంతో స్వాగతించిన స్పీకర్ ప్రమీలా మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన రఘుబర్ దాస్ మంగళవారం పూరీ చేరారు. జంషెడ్పూర్ నుంచి రైలులో పూరీ చేరిన ఆయనకు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ విశాల్ సింఘ్ స్వాగతం పలికారు. రాజ్ భవన్‌లో స్వల్ప విరామం తర్వాత శ్రీమందిరంలో జగన్నాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి దర్శనం కోసం బారులుతీరిన భక్తులకు ఆయన ఆత్మీయంగా అభివాదం చేశారు.

నేడు ముహూర్తం

మంగళవారం ఉదయం 11.45 గంటలకు భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయన పూరీ నుంచి భువనేశ్వర్‌కు బయల్దేరారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు రఘుబర దాస్ భువనేశ్వర్‌లో లింగరాజ్ ఆలయంలో ప్రార్థనలు చేయనున్నారు. రఘుబర్ దాస్ కుటుంబ సభ్యులు, పలువురు బీజేపీ నేతలు, రాష్ట్ర కేబినెట్ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొననున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్టోబర్ 18న ఒడిశా 26వ గవర్నర్‌గా దాస్‌ను నియమించిన విషయం తెలిసిందే. లోగడ ఆయన 2014 నుంచి 2019 వరకు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు.

రాజ్‌భవన్‌లో ఘన స్వాగతం

రాష్ట్ర 26వ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు సోమవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌కు రఘుబర్ దాస్ చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్వాగతం పలికారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్ ప్రమీలా మల్లిక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్.కె.బన్సాల్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఒడిశా ప్రజలకు చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర అభివృద్ధే మొదటి ప్రాధాన్యత అని, ఒడిశాలోని రాజ్‌భవన్ ప్రజలకు ఎల్లప్పుడూ తెరిచే ఉంటుందని పేర్కొన్నారు.


జయపురం: పట్టణంలో నగర సంకీర్తనలు జరుపుతున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో పూజలు

కార్తీకం మొదటి సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు దైవ దర్శనానికి పోటెత్తారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. పలు సంకీర్తన దళాలు భజనలు చేసుకుంటూ నగర సంచారం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


జయపురం: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీజగన్నాథుడు


జయపురం: భక్తులకు దర్శనమిస్తున్న వల్లభ నారాయణుడు


రాయగడ: శివాలయంలో బారులుతీరిన భక్తులు

కదం తొక్కిన కర్షకులు


వరి దుబ్బతో ర్యాలీలో పాల్గొన్న రైతులు


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మల్కన్‌గిరి: ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ కర్షకులు కదం తొక్కారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ విశాల్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్కన్‌గిరి అంటే వ్యవసాయానికి పేరుగా ఉండేదన్నారు. అలాంటి జిల్లాలో ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచుతున్నారు కానీ రైతులకు మాత్రం పరిహారం అందించడం లేదని వాపోయారు. జిల్లాలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 7 సమితుల్లో మండీల్లో ఉన్నటువంటి ధాన్యానికి క్వింటాకు రూ.3,600, రైతుకు నెలకు భద్రత భృతి రూ.5,000, ప్రతి సమితిలో కోల్డ్ స్టోరేజీ, కరువు కారణంగా రైతుల పిల్లలకు ఫీజులు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వందలాది మంది రైతులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గొట్లాంను దత్తత తీసుకున్న మెడికల్ విద్యార్థులు


సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం మెడికల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట, బారికపాలెం, జియ్యన్నవలస గ్రామాలను విజయనగరంలోని గాజులరేగ వద్ద గల ప్రభుత్వ మెడికల్ యూనివర్సిటీ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. 2023 సంవత్సరం నుంచి 5 సంవత్సరాల పాటు ఆ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు మెడికల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గొట్లాంలోని గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామానికి చెందిన నాయకులతో పాటు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో ఈఏడాది కొత్తగా మెడికల్ సీట్లు పొంది విద్యను అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులు ఒక్కొక్కరూ 5 కుటుంబాలు చొప్పున 750 కుటుంబాలును దత్తత తీసుకుని కుటుంబాల్లోని వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. 5 సంవత్సరాల పాటు విద్యార్థులు గ్రామంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రతి నెలా రెండవ శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 11న గ్రామంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, బొండపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజ్‌గోపాల్, ఎస్.ఎ.బాషా, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన


ప్రమాద కారణాలపై రైల్వే అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి సుధామ్ మరిండి

కొత్తవలస: విజయనగరం జిల్లా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదం స్థలాన్ని ఒడిశా రెవెన్యూ, విద్యాశాఖ మంత్రి సుధామ్ మరిండి సోమవారం పరిశీలించారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ, ప్రమాదానికి గల కారణాలను రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సాఫ్ట్‌బాల్ అండర్-19 పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక నవంబరు ఒకటిన నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ తెలిపారు. దుప్పలవలసలో సోమవారం వివరాలు వెల్లడించారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జెడ్పీ పాఠశాల మైదానంలో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు విద్యార్థులు 6302546128 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



శిక్షణ పొందిన విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న సీజీఎం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శిక్షణలో నేర్చుకున్న అంశాలతో వృత్తిలో రాణించాలని ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ సేల్స్ విద్యార్థులకు ఐటీసీఎల్ సీజీఎం (హెచ్‌ఆర్) శ్రీనివాస్ పట్నాయక్ సూచించారు. జెమ్స్‌లో సోమవారం ఫార్మసీ అసిస్టెంట్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసపట్నాయక్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా తాము ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా రాని సంతృప్తి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంతో వస్తుందన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థులకు అందిస్తున్న అత్యున్నత శిక్షణ, సదుపాయాలు, సౌకర్యాలను ప్రశంసించారు. విద్యార్థులతో ముచ్చటించి ప్రగతిని మెచ్చుకున్నారు. ఐటీసీఎల్ సీజీఎం (ఆపరేషన్స్) శ్రీనివాసన్ మాట్లాడుతూ అనతికాలంలోనే విద్యార్థులను తీర్చిదిద్ది, ఉద్యోగాలు కల్పించడం ఆనందదాయకమన్నారు. టాస్క్ డిప్యూటీ మేనేజర్ భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణను సమర్థంగా పూర్తి చేసి, ఉద్యోగాలిచ్చిన బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థను అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐటీసీఎల్ సీసీఎం విద్యాసాగర్, సీఎస్‌ఆర్ మేనేజర్ సిద్ధార్థ్ చౌదరి, మేనేజర్ అబిద్, బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ పద్మజ, మహానంద, ఎండీ కిశోర్, బొల్లినేని మెడి స్కిల్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

2న దేవుపురంలో నృత్యపోటీలు

మందస: మండలంలోని దేవుపురంలో నవంబరు 2న జిల్లాస్థాయి నృత్యపోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్రతిధులు పినకాన ఉమాశంకర్, ఎల్.కిరణ్, పి.బాలకృష్ణ, ఎం.చంద్రమౌళి, ఎస్.రమేష్ చెప్పారు. డ్యూయెట్, సోలో సాంగ్స్‌లకు వేర్వేరుగా బహుమతులు అందజేస్తామన్నారు. నవంబరు 1వ తేదీ సాయంత్రంలోగా పాల్గొనేవారు తమ పేర్లను 8985021765, 9908786532 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు. శ్రీనందెన్న సంబరాలు సందర్భంగా ఈ నెల 27 నుంచి నవంబరు 4వ వరకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రెండో తేదీన బాలనాగమ్మ బుర్రకథ ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో గాయాలతో పడి ఉన్న యువకులు

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుడివాడ గ్రామానికి చెందిన పున్నయ్య, ఈశ్వరరావు అనే ఇద్దరు యువకులు తమ ద్విచక్రవాహనం టెక్కలి నరసన్నపేట వైపు వెళ్తున్న సమయంలో టెక్కలి మండలం అక్కవరం జాతీయ రహదారి వద్ద రోడ్డు పక్క గా ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టి తుళ్లి పడిపోయారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు టెక్కలిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలం బెజ్జిపురం పంచాయతీ శాలిపేట గ్రామానికి చెందిన గొర్లె సన్యాసిరావు (57) అనే వ్యక్తి సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇతను పొందూరు మండలం కృష్ణాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి పరామర్శకు బయల్దేరారు. బెజ్జిపురం జంక్షన్ వద్ద శ్రీకాకుళం వైపు రావడానికి జాతీయ రహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న స్కార్పియో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సన్యాసమ్మతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో చీకట్లు..



పట్టాలపై మృత్యుఘోష

ఒక ప్రయాణం పదమూడు ఇళ్లలో దీపాలు ఆర్పేసింది. ఒక ప్రమాదం పదుల సంఖ్యలో కుటుంబాలను కన్నీట ముంచేసింది. ఒక సాయంత్రం ఆ ప్రయాణికుల బతుకుల్లో చీకట్లు నింపేసింది. కంటకాపల్లి రైలు ప్రమాద ఘటనతో జిల్లా తల్లడిల్లింది. ఈ ఘటనలో ముగ్గురు జిల్లా వాసులు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శుభ కార్యం కోసం వెళ్లి ఇద్దరు మృత్యువాత పడగా.. అసిస్టెంట్ లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తూ మరొకరు కన్నుమూశారు.



సంఘటన స్థలం వద్ద పునరుద్ధరణ చర్యలు

విషాదం మిగిల్చిన రైలు ప్రయాణం

- విజయనగరం జిల్లా రైలు ప్రమాదం మృతుల్లో ముగ్గురు జిల్లా వాసులే
- క్షతగాత్రుల సంఖ్య ఎక్కువే
- జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో విషాదం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

రైలు ప్రమాదం ఊహించని రీతిలో ప్రయాణికుల ఉసురు తీసింది. గమ్యస్థానాలకు చేరుకోకుండా కొందరి ప్రయాణాలు ఆగిపోయాయి. విజయనగరం జిల్లాలో జరిగిన దుర్ఘటనలో మరణించిన వారి కన్నీటి కథలు గుండెలవిసిపోయేలా ఉన్నాయి. ఎంతో ఆనందంతో శుభ కార్యక్రమానికి వెళ్లిన మేనత్త, మేనకోడలు విగత జీవులుగా ఇంటికి రాగా, ఉన్నత ఉద్యోగమని ఎన్నో ఆశలతో లోకో పైలెట్‌గా చేరిన మరో యువకుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆగి ఉన్న పలాస పాసింజర్ రైలును వెనక నుంచి వస్తున్న రాయగడ పాసింజర్ ఢీకొన్న ప్రమాదంలో మన జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. గాయపడ్డ వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఈ ఘటనలో మొత్తం 14 మంది మృతి చెందగా, 54 మంది గాయపడ్డారు. మృతదేహాల్లో 13 మందిని గుర్తించగా, మరొకటి గుర్తించలేని పరిస్థితిలో ఉంది. ప్రమాదంలో ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన వారే ఎక్కువగా బాధితులయ్యారు. జి.సిగడాం మండలానికి చెందిన వారే ఎక్కువగా క్షతగాత్రుల్లో ఉన్నారు. రెండు కుటుంబాలకు చెందిన వారు గాజువాకలో జరిగిన రజస్వల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో మేనత్త, మేనకోడలైన ఎస్.పి.రామచంద్రపురానికి చెందిన గిడిజాల లక్ష్మీ, మెట్టవలసకు చెందిన టంకాల సుగుణమ్మ ప్రాణాలు కోల్పోయారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన సువ్వారి చిరంజీవి(35) అసిస్టెంట్ లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో బలైపోయాడు.

● పలాస వాసికి గాయాలు





విజయనగరం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న నిరాకర మిశ్రో, బొడ్డేపల్లి తేజేశ్వరరావు

కాశీబుగ్గ: విజయనగరంలో జరిగిన రైలు ప్రమాదంలో పలాస మండలం మరదరాజపురం గ్రామానికి చెందిన నిరాకర మిశ్రో గాయపడ్డారు. కనురెప్పపాటులో జరిగిన సంఘటనలో ఒక్కసారిగా ఉన్నట్టుండి బోగి పైకిలేచి పడిపోవడంతో కుడిచెయ్యి ఎముక, జబ్బ పూర్తిగా దెబ్బతిన్నాయి. విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. మిత్రుల సాయం చేయడంతో బయటపడ్డానని లేకుంటే ప్రాణాలు పోయేవని మిశ్రో తెలిపారు.

బొడ్డేపల్లి వాసికి..

పొందూరు: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో పొందూరు మండలంలోని బొడ్డేపల్లి గ్రామానికి చెందిన బొడ్డేపల్లి తేజేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. పనిమీద విశాఖపట్నంకు వెళ్లి డీఎంయూలో తిరిగి వస్తుండగా రైలు ప్రమాదానికి గురవ్వడంతో గాయాలపాలయ్యారు. తేజేశ్వరరావును విశాఖపట్టణంలోని రైల్వే ఆస్పత్రిలో చేర్చారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగుపడుతోందని చెప్పారు.

● రైళ్లు రద్దు

విజయనగరం రైలు ప్రమాదంలో పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు. ప్రస్తుతం ప్రమాద స్థలం వద్ద 8 పొక్లెయిన్ మిషన్లు, 140 టన్నుల రెయిల్ క్రేన్, 800 నుంచి 900 మంది రైల్వే సిబ్బందితో శరవేగంగా రైలుపట్టాల పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. 31వ తేదీకి విశాఖపట్నం - గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17240), తిరుపతి - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (08584), కొరాపుట్ - విశాఖపట్నం (18511), రాయగడ - విశాఖపట్నం (08503), విజయనగరం - విశాఖపట్నం (07469) రైళ్లను రద్దు చేశారు. -కాశీబుగ్గ



● రిజర్వేషన్లు కూడా..

విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం వల్ల రైళ్లు రద్దు కావడంతో ముందస్తుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. రద్దు చేసుకోవడానికి వచ్చిన ప్రయాణికులతో ఆమదాలవలస రైల్వే రిజర్వేషన్ కౌంటర్ రద్దీగా మారింది.

-ఆమదాలవలస రూరల్



శ్రీకాకుళంలో నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద టికెట్‌ల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

● వెంటాడిన మృత్యువు..



సువ్వారి చిరంజీవి (ఫైల్)

కంటకాపల్లి రైలు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామానికి చెందిన సువ్వారి చిరంజీవి (36) మృతి చెందారు. ప్రమాదానికి గురైన రైలుకు ఆయన అసిస్టెంట్ లోకో పైలెట్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రమాద సంఘటన మీడియా ద్వారా తెలుసుకున్న తండ్రి సన్యాసిరావు, తల్లి అమ్మాజీ, గ్రామ పెద్దలు, బంధువులు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. చిరంజీవికి మూడేళ్ల కిందట పెళ్లయ్యింది. భార్య జ్యోత్స్న, రెండేళ్ల కుమారుడు నవదీప్‌తో కలిసి విశాఖలో నివాసం ఉంటూ అక్కడే విధులు నిర్వహిస్తున్నాడు. తల్లిదండ్రులు కుశాలపురంలో నివాసముంటున్నారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో ట్రిపుల్ ఈలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన చిరంజీవి 2013లో అసిస్టెంట్ లోక్ పైలెట్‌గా ఎంపికయ్యాడు. జీవితంలో స్థిరపడి ఉద్యోగం చేస్తున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు ఎంతో ఆనందించేవారు. ఇప్పుడు అకస్మాత్తుగా బిడ్డ మరణ వార్త వినాల్సి రావడంతో వారు తల్లడిల్లిపోయారు. మృతదేహానికి విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కుశాలపురంలో సోమవారం అంత్యక్రియలు చేశారు. - ఎచ్చెర్ల క్యాంపస్

ముమ్మరంగా సహాయక చర్యలు



కంటకాపల్లి రైలు ప్రమాద బాధితులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పరామర్శించారు. క్షతగాత్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వైద్య చికిత్స ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ఆస్పత్రిలో బాధితుల బెడ్ల వద్దకు వెళ్లి వారి కన్నీరు తుడిచారు.

పల్లె కంట కన్నీరు





సుగణమ్మ(ఫైల్)



లక్ష్మి(ఫైల్)



రోదిస్తున్న సుగుణమ్మ కుటుంబ సభ్యులు

జి.సిగడాం మండలంలోని మెట్టవలస, ఎస్పీఆర్ పురం గ్రామాలు విషాదంలో మునిగిపోయాయి. విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో ఎస్పీఆర్‌పురం గ్రామానికి చెందిన గిడిజాల లక్ష్మి(43) ఘటనా స్థలిలోనే కన్నుమూయగా.. మెట్టవలస గ్రామానికి చెందిన టంకాల సుగుణమ్మ (60) విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. వీరిద్దరూ మేనత్త మేనకోడళ్లు కావడం గమనార్హం. విశాఖలో జరిగిన శుభ కార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వీరు మృత్యువుకు దొరికిపోయారు. ఇదే శుభకార్యానికి ఎస్పీఆర్‌పురం గ్రామం నుంచి ఐదుగురు, మెట్టవలస నుంచి 20 మంది, జి.సిగడాం గ్రామం నుంచి 15 మంది వెళ్లారు. మెట్టవలస గ్రామం నుంచి రెండు ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రైలెక్కి ఇలా ప్రమాదంలో చిక్కుకున్నారు. మృతుల్లో గిడిజాల లక్ష్మికి భార్య రామారావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుగణమ్మకు కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలానికి వైఎస్సార్ సీపీ మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావులతోపాటు బంధువులు వెళ్లారు. -జి.సిగడాం

ఐదుగురం వెళ్లాం..

విశాఖలో నిర్వహించిన శుభకార్యక్రమానికి మా కుటుంబం నుంచి ఐదుగురం వెళ్లాం. తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కాం. మేము నలుగురం ఇంజిన్ నుంచి నాల్గో బోగీలో ఉన్నాం. మా లక్ష్మి అమ్మ మాత్రం చివరి రెండో బోగీ ఎక్కారు. చివరి మూడు బోగీలు పట్టాలు తప్పడంతో మా లక్ష్మి అమ్మ అక్కడే చనిపోయింది. మా అమ్మమ్మ సుగుణమ్మ కూడా అదే బోగీలో ఉంది. ఆమె కూడా ఆస్పత్రిలో చనిపోయింది. మా కళ్ల ముందే ఇంత పెను ప్రమాదం జరిగింది.

- మృతుల కుటుంబ సభ్యులు

● శ్రీకాకుళం కాంప్లెక్స్ కిటకిట



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రైలు ప్రమాదం సంభవించడంతో ఆదివారం రాత్రి నుంచి రైళ్లు రద్దయిపోయాయి. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే వారు సోమవారం ఉదయం నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆశ్రయించారు. నాన్‌స్టాప్ పోర్టికో వద్ద బస్సుల కోసం ప్రయాణికులు గంటల కొద్దీ సమయం వేచి ఉన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడిపారు. పలాస డిపో నుంచి విశాఖపట్టణానికి ప్రస్తుతం నడుస్తున్న బస్సులకు అదనంగా 15 బస్సులను సోమవారం ఉదయం 3.45 గంటల నుంచి నడిపారు. అలాగే శ్రీకాకుళం నుంచి పలాస, ఇచ్ఛాపురానికి వెళ్లే వారి కోసం ఏడు అదనపు సర్వీసులు నడిపారు. డీపీటీఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైళ్లు రద్దయిన కారణంగా ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు సర్వీసులు నడుపుతున్నామన్నారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు, పలాస, టెక్కలి డిపోల మేనేజర్లను అప్రమత్తం చేశామని చెప్పారు. - శ్రీకాకుళం అర్బన్

ఉద్దానం పల్లెల్లో పులి సంచారం



తిప్పనపుట్టుగ కొబ్బరితోటల్లో పులి అడుగులను గుర్తిస్తున్న అటవీశాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానమంతా పెద్దపులి సంచరిస్తోంది. మొన్న కంచిలి మండలం మండపల్లి, అమ్మవారిపుట్టుగ, బల్లిపుట్టుగ, నిన్న బొరివంక, బెజ్జిపుట్టుగ, జగతి, పుక్కళ్లపాలేం తీర ప్రాంతాల్లో పెద్ద పుట్టి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీశాఖాధికారులు నిన్న ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగ, ఈదుపురం, కొఠారీ, ధర్మపురం, రాజపురం పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు వెల్లడించారు. సోమవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏ.మురళీకృష్ణం నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా గ్రామాల్లో పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ సదాశివుని గురుమూర్తితో కలసి అటవీశాఖాధికారులు ఈదుపురం, కొఠారీ, తిప్పనపుట్టుగ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెద్దపులి కొఠారీ ఉమ్మడి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉందని తెలిపారు.

మీ పరిధిలో ఫిర్యాదు చేయొచ్చు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలెవరైనా తాము ఫిర్యాదు ఇవ్వదల్చుకుంటే వారి పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్లలో కూడా స్పందన ఫిర్యాదు చేసుకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ రాధిక పాల్గొన్నారు. అర్జీదారుల నుంచి 45 వినతులు (కుటుంబ తగదాలు-05, పారసంబంధమైన-16, చీటింగ్-03, సైబర్-01, పాతవి-07, ఇతర ఫిర్యాదులు-13) స్వీకరించి సానుకూలంగా స్పందించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్లు చేసి త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వారి వారి పీఎస్ పరిధిల్లో వచ్చిన స్పందన ఫిర్యాదులన్నింటినీ చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరావు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ఆయన సోమవారం సాయంత్రం బీఎల్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గడువు కంటే ముందే వాటిని పూర్తి చేసేలా పని చేయాలన్నారు. నవంబర్ 11, 12 అలాగే డిసెంబర్ 2, 3వ తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆయా కేంద్రాల్లో ఎన్నికల అధికారుల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలన్నారు. ఓటరు వెబ్‌సైట్, యాప్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కాలేజీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌తో 10 మంది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే 15 రోజుల్లో విచారణ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

సంబరంగా తొలేళ్ల ఉత్సవం

- ఘటాలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్ దంపతులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దంపతులు, ప్రముఖులు
- అలరించిన వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- భక్తులతో కోలాహలంగా మారిన చదురుగుడి, వనంగుడి
- నేడు సిరిమానోత్సవం



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి తొలేళ్ల ఉత్సవంతో శ్రీకారం చుట్టారు. సోమవారం వేకువ జామునుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. పూసపాటి వంశీయులైన అశోక్ గజపతిరాజు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను కోట నుంచి సంప్రదాయరీతిలో పల్లకిలో తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వేదాశీస్సులు అందజేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సతీసమేతంగా పైడితల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి సిరిమానోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని, మూడురోజుల పండగ ప్రశాంతంగా జరగాలని తల్లిని ప్రార్థించామన్నారు. విశాఖ శ్రీ శారదా పీఠం స్వరూపనందేంద్ర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఆయనకు వేదపండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలంటేనే ఓ ప్రత్యేకత ఉంటుంది. ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా అమ్మవారి జాతరను ఏటా అత్యద్భుతంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని ప్రార్థించామన్నారు.

ఘటాలతో నివేదన

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నగరంలోని పలువురు భక్తులు వివిధ వేషధారణలతో, డప్పుల మోతలతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించారు. ఘటాలను సమర్పించారు. తొలేళ్ల ఉత్సవం రోజున ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 15 వేల మంది వరకూ దర్శించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఉచిత సేవలు

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థలు మంచి నీరు, మజ్జిగను ఉచితంగా అందజేశాయి. మరికొందరు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీస్ సేవాదళ్‌తో పాటూ పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. ఎస్పీ ఎం.దీపిక సారథ్యంలో పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది.

సంప్రదాయబద్ధంగా ఉత్సవం



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పూసపాటి అశోక్ గజపతి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దంపతులు

అమ్మవారి చదురుగుడి నుంచి ఘటాలతో నడుచుకుంటూ పూజారి వెంకటరావుతో పాటు పలువురు పెద్దలు, దీక్షాపరులు కోటలో ఉన్న కోటశక్తికి సోమవారం పూజలు చేశారు. ఆరు ఘటాలు కోట వద్ద నుంచి తిరిగి చదురుగుడికి తీసుకెళ్లి అమ్మవారి చదురువద్ద పెట్టారు. సిరిమాను పూజారి వెంకటరావు అమ్మవారి కథను భక్తులకు వినిపించారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేసి, ఆశీర్వచనాలను అందజేశారు. ఉత్సవాల్లో భాగంగానిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అమ్మవారిని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ.శంకరరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జబర్దస్త్ కమెడియన్ అప్పారావు దంపతులు దర్శించుకున్నారు.